ముగ్గురు బాస్‌లు!

ఏ. వీ. మోహన్రావ్

విశాలమైన ఎయిర్ కండిషన్ గది. ద్వారానికి ఎదురుగా వున్న కిటికీ నానుకునివున్న రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని ముందున్న కోడిగ్రుడ్డు ఆకారపు బల్లపైన కాళ్ళు రెండూ ఒకదానిపైన ఒకటి పెట్టుకుని వూపుకుంటూ కూర్చున్నాడు బాస్. నిశ్శబ్దం రాజ్యం చేస్తుందా క్షణాన గదిలో.

నేను తలుపు దగ్గర నిలుచున్నాను.

"కమిన్ మై ఫ్రెండ్!" పిలిచాడు బాస్. అతని మొహం నాకు కనుపించలేదు. ఇంతకు ముందెప్పుడూ నే నాయన్ని చూడలేదు. కానీ పదిసంవత్సరాలనుండి అతని క్రింద పనిచేస్తున్నాను.

మెల్లిగా వెళ్ళి నిలుచున్నాను.

"కూర్చో!" అన్నాడు బాస్.

టేబుల్‌కు ఇవతలవేపున్న కుషన్ కుర్చీలో కూలబడ్డాను.

"నీ పేరు?"

"అరవై మూడు బాస్!" అన్నాను.

"అది నెంబరు. పేరు నే నడిగింది!"

"సుధీర్!"

"గుడ్ నేమ్!" అంటూ కాళ్ళు రెండూ టేబుల్‌పై నుంచి తీశాడు బాస్. అప్పుడే అతని మొహం చూశాను. గుమ్మడికాయలా గుండ్రంగా వుంది. నెత్తినఒక్క వెంట్రుక కూడా లేదు. లావుపాటి కనుగుడ్లు. మొఖానికి అతికించి నట్లున్న పెద్దముక్కు. చెంపలపైన కత్తిగాట్లు. మెడకు నల్లటి మఫ్లర్ చుట్టుకుని వున్నాడు. అతని ముఖంలో గాంభీరతకన్నా క్రౌర్యం, ఉదాత్తతకన్నా ఉడుకు మోతుతనం, అభిమానంకన్నా అసూయ, ప్రేమకన్నా స్వార్థం, ఎక్కువగా వున్నట్లు తోచాయి.

"నిన్నెందుకు పిలపించానో తెలుసా?" అడిగాడు తీక్షణంగా నాకేసి చూస్తూ.

"తెలీదు బాస్!"

"ఇన్నేళ్ళనుండి నమ్మకంగా నా దగ్గర పనిచేస్తూ, కుడి భుజంగా మసిలినవ్యక్తి, ద్రోహంచేసి, నా సర్వస్వం దోచుకొని వెళ్ళిపోయాడు. నా మనుషుల్లో చాలామంది అతని వేపు తిరిగారు, ఇంత నమ్మకద్రోహం చేసేసాహాసం, ఊహా, అతని కున్నాయని నే ననుకోలేదు. అందుకే అప్రమత్తుడిగా వుండలేక పోయాను."

నేనేం మాట్లాడకుండా అతనికేసిచూస్తూ కూర్చుండి పోయాను.

"అతన్ని వేటకుక్కలా వేటాడి, చిఱుతపులిలా, కండకు కండలుగా చీల్చి, గుండెపిండి నెత్తురు తాగా అన్నంత క్రౌర్యం నాలో పెరిగింది. నేనే రంగంలోకి దిగు దామనుకున్నాను. కానీ సమర్ధుడివి నువ్వుండగా నేను చెయ్యి చేసుకోవలసిన అవసరం రాదనిపించింది. అందుకే కబురు పెట్టాను." అన్నాడు బాస్.

విని ఊరకే వుండిపోయాను.

"ఇది చాలా ప్రమాదంతో కూడుకున్నపని. డేవిడ్ డెవిల్ లాటివాడు. అతనితో నాకులాగే నీకూ కావలసి నంత పరిచయముందనుకుంటాను. ఈ ప్రయత్నంలో నీ ప్రాణాలుపోయే అవకాశం కూడా వుంది. అందుకు సన్న ద్ధుడివై తేనే మిగిలిన వివరాలు మాట్లాడుకుందాం! ఆలో చించి చెప్పు!" అన్నాడు బాస్.

ఆలోచనలో పడ్డాను నిజంగానే. బాస్ ఉత్తరువు లంటూ నా చేత పదేళ్ళనుండీ గాడిద చాకిరీ చేయించు కున్నాడు. ప్రతిఫలంగా నాకు ముట్టింది చాలా తక్కువ. అతను బాస్‌ను మోసంచేసి పోయేనాటికి నా దగ్గర రెండే రెండు వందనోట్లు మిగిలాయి. దాన్నిబట్టి నా కెంత అన్యాయం చేశాడో ఎవరైనా లెఖ్ఖగట్టవచ్చు. మొదట్లో అవసరానికి బానిసనై ఈ పాపకూపంలోకి దిగాను. ఆ తర్వాత ప్రాణాలకు ఆపదరాకుండా చూసుకునేందుకు డేవిడ్ ఆడించినట్లల్లా ఆడాను. ఏది ఏమైనా నేను చాలా నేరాలుచేసిన విషయం నిజం. నా కోసం పోలీసులు వెతుకు తున్న విషయం నాకే కాదు, బాస్‌కూడా తెలుసు.

"ఏమంటావ్?"

"యస్ అంటే నాకు ఒరిగేదేమిటో తెలుసుకోవాలి!" అన్నాను.

"డేవిడ్ ఇన్నేళ్ళు అనుభవించిన స్థానం నీకు దొరుకుతుంది. లాభాల్లో సగం నీకిస్తాను." అన్నాడు బాస్.

"అయితే సరే!! డేవిడ్‌ను చంపితెచ్చి అతని శవాన్ని నీ కాళ్ళపైన పడేస్తాను." అన్నాను, ఆవేశంగా ఉత్సాహంతో.

"అదే నాక్కావాలి! డేవిడ్ ఇప్పుడెక్కడున్నాడో తెలుసా?"

"తెలీదు! అవన్నీ తెలుసుకొంటాను. పనిపూర్తిచేస్తాను. ఆ బాధ్యత నాది."

బాస్ ముఖంలో చిరునవ్వు వెలిసింది.

2

బాస్ బంగళాలోంచి బయటికొచ్చి రోడ్ పైన నిలుచున్నాను. టాక్సీగానీ, ఆటోగానీ, దొరుకుతుందేమోనని ఎదురుచూడసాగాను. పదినిముషాలు పైనే నిలుచున్నాను. ఏదీ రాలేదు. విసుగుపుట్టుకొచ్చింది.

కొంతదూరం ముందుకుపోతే ఏదైనా దొరుకుతుందేమోనన్న ఉద్దేశ్యంతో నడవడం మొదలెట్టాను పేవ్ మెంట్ పైన.

ప్రక్కగా తెల్లటి బెంజ్ కారొచ్చి ఆగింది, టైర్లు రోడ్‌కు రాచుకుని కీచుమని శబ్దమైంది.

తలత్రిప్పి చూశాను.

డ్రైవింగ్ సీటులో పాలరాతి బొమ్మలాటి అందమైన అమ్మాయివుంది. ఆమె నన్ను చూచి నవ్వింది అందంగా. నేను నవ్వాను.

"వాంట్ ఎ లిఫ్ట్?"

"యస్!"

"కమిన్!" అందామె తలుపు ఎడంచేత్తో తీస్తూ.

ఎక్కి కూర్చున్నాను కార్లో.

"ఎందాకా వెళ్ళాలి." అడిగిందామె.

"అబిడ్స్!" అన్నాను.

"నేనూ అక్కడికే వెళ్తున్నాను. ఇక్కడేనా మీ బంగళావుంట."

"కాదు! నా ఫ్రెండ్ ఒకతను వుంటున్నాడు. అతన్ని చూసేందుకు వచ్చాను."

కారు బయలుదేరింది.

"మీ పేరు చెప్పలేదు?" అడిగిందామె.

"మీరు అడగలేదుగా?" అన్నాను.

"ఘటికులే?"

"మీ కన్నానా?"

కారు తాజ్ మహల్ దాకా వచ్చేసింది. ఆటోమేటిక్ సిగ్నల్ నిప్పులా ఎర్రగా వెలుగుతూంది. కారాగి పోయింది.

"ఆఁ!"

"ఎందు కనుకుంటున్నారలా?"

"మీకు తెలిసినా, తెలీనట్లే నటిస్తున్నారు. నా చేతులో లక్షలున్నాయను కున్నారా. లేక ఆ కాగితాలు లక్షలు విలువ చేస్తాయనుకున్నారో, అర్థంకావటంలేదు. నా హాఫ్ పాకెట్లోవున్న కాగితాలబొత్తి లాగేశారు. అవునా?" అడిగాను ఉదాసీనంగా.

"నాన్సెన్స్! ఎవరితో మాట్లాడుతున్నారో తెలుసు

కని మాట్లాడండి?" అందామె కళ్ళు పెద్దవిచేసి. ముఖం మాడ్చుకుంటూ.

"మీ రివరైందీ నా కనవసరం! నా కాగితాలు నా కిచ్చెయ్యండి! నేను అనవసరంగా ఒకరితో దెబ్బలాడే మనిషినికాను. అవసరమొస్తే దెబ్బలాడటం మాత్రంకాదు! మెరుపు దెబ్బతీయగల సామర్థ్యమున్నవాణ్ని!" అన్నాను కోపంగా.

"అలాగా! అందుకే ఏరికోరి నీకు లిఫ్ట్ ఇచ్చింది!" అందామె గుండ్రటి కళ్లు త్రిప్పుతూ.

"అంటే నేను మీకు ముందే తెలుసా?"

"తెలుసు! నాకు తెలిసిన విషయాలు నీకు తెలుసుకోవాలనుంది కదూ!" అంటూ కారు స్టార్ట్ చేసిందామె.

"మళ్ళా ఎక్కడికి?"

"ఏదైనా ఏకాంత ప్రదేశానికి" అంటూ మరికొంత దూరం పోనిచ్చి 'మహారాజా' రెస్టారెంటు ముందాపి, దిగమని సంజ్ఞ చేసింది.

కారుదిగాను. ఆమె వెంట మాట్లాడకుండా నడిచాను. ఇద్దరం మూడో అంతస్తులోవున్న ప్రైవేట్ అన్న క్యాబికల్ లోకి వెళ్ళి కూర్చున్నాం.

బేరర్ వచ్చాడు.

ఆమె ఆర్డరుచేసింది తినేందుకు ఏవేవో పదార్థాలు.

"నీ పేరు సుధీర్ కదూ!"

అవునన్నట్లు తలూపాను.

"డేవిడ్ ను తెలుసా నీకు?"

"తెలుసు!" అన్నాను.

"అదే నాకు తెలుసు. అతన్ని ఎలాగైనా చంపాలి! అందుకు నీ సాయం కావాలి!" అందామె రకున్న.

ఆశ్చర్యపోవడం నా వంతయింది. అందాకా ఆమె డేవిడ్ తాలూకు మనిషన్న అపోహలో వుండిపోయాను.

"అతనిపైన మీకెందుకు పగ?" అడిగాను.

"నా భర్తను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నాడు. పోలీసులకు చిక్కకుండా, చట్టానికి అందకుండా మెల్లగా జారుకున్నాడు."

"ఐ. సీ. నా గురించి మీకెలా తెలుసు."

"డేవిడ్ చెప్తుంటే విన్నాను. అతను మా యింటికి చాలాసార్లు వచ్చాడు. మా వారితో చేతులు కలిపి స్మగ్లింగ్ వ్యాపారం చేశాడు. ఆ వ్యవహారాల్లోనే ఆయన్ని చంపివేశాడు." అందామె.

"అప్పట్లో నీ గురించి చాలా గొప్పగా చెప్పాడు. అతనిపైన పగతీర్చుకునేందుకు నీ కన్నా సమర్థుడైన వ్యక్తి నాకు వేరెవ్వరూ కనుపించలేదు. నిన్ను దాదాపు నెల రోజులనుండి వెంటాడుతున్నాను. ఇవాల్టికి కలుసుకొని మాట్లాడే అవకాశం చిక్కింది" అందామె తిరిగి.

"నా కాగితాలు..." అన్నాను.

"ఇవిగో. తీసుకో. వీటితో నాకేం పనిలేదు. నీతోనే!" అంది, నా వైపు చూస్తూ.

"అలాగే! మీకు సాయంచేస్తాను!" అన్నాను.

బేరర్ డ్రింక్స్, తినే పదార్థాలు తెచ్చి టేబుల్ పైన పెట్టాడు. ఇద్దరం హాయిగా తిని, తాగాం. అరగంటపైనే హోటల్‌లో వున్నాం.

ఆమె ఏవేవో మాట్లాడసాగింది. తిండిపైని ధ్యాసతో "ఊఁ, ఆఁ!" అంటూ విన్నట్లు నటించాను.

బేరర్ బిల్లు తెచ్చాడు. ఆమే చెల్లించింది. ఇద్దరం దిగి క్రిందకొచ్చాం.

"మరి మన ప్రోగ్రాం ఏమిటి?" అడిగిందామె.

"నేను కొంత సమాచారం సేకరిస్తున్నాను. అదంతా అందేందుకు రెండ్రోజులు పడుతుంది. ఆ తర్వాత ఏం చెయ్యవలసింది ఆలోచించుకుందాం!" అన్నాను.

"ఓ.కే. నా టెలిఫోన్ నెంబరు ఈ కాగితంపైన వ్రాసి వుంచాను. ఆ నెంబరు రింగుచేసి, మాయ అని అడిగితే నన్ను పిలుస్తారు." అంటూ కాగితం అందించి, సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయింది.

కారు కనుమరుగైందాకా చూసి, ఆ తర్వాత కాలినడకన నా రూంకు బయలుదేరాను.

రామ్‌కోటి చౌరాస్తా దగ్గిర పేవ్‌మెంట్ వారగా, నా ప్రక్కనే మోటార్ సైకిల్ వచ్చి ఆగడం గమనించి తల త్రిప్పాను.

విక్రమ్, వినోద్ ఇద్దరూ కనిపించారు.

నన్ను చూచి నవ్వి దిగివచ్చారు దగ్గరకు.

"ఏం బ్రదర్స్ బాగున్నారా?" అడిగాను.

"ఆఁ! నువ్వు ఎలాగున్నావ్?" అడిగారు.

"బాగానే వున్నాను."

"వ్యాపారం ఎలావుంది. ప్రస్తుతం పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ లేరనుకుంటాను!" అడిగాడు విక్రమ్.

"ఎవరో ఒకరు దొరుకుతారులే!" అన్నాను.

"మేము డేవిడ్ తరపున పనిచేస్తున్నాం!"

వాళ్ళామాట అనగానే, నాకు నా బాస్, అతనితోపాటు మాయవాళ్ళు కోరినకోరిక, పెట్టిన బాధ్యత గుర్తొచ్చాయి.

"డేవిడ్! అతనెక్కడున్నాడు?"

"తెలీదు!"

"తెలీకుండా ఎలా పనిచేస్తున్నారు?"

"ఇన్నాళ్ళు మన బాస్ ఎవరో తెలీకుండా పనిచేసి అత నికి మనం డబ్బు సంపాదించి ఇవ్వలేదూ? అలాగే ఇదీనూ!" అన్నాడు వినోద్.

"నువ్వూ మాతో పని చెయ్యరాదూ!" అడిగాడు విక్రమ్.

"అంత అవుసరం లేదు!" అన్నాను ముక్తసరిగా.

"కానీ దేవిడ్ కు నీతో అవసరముంది. నువ్వు కనిపిస్తే వెంటనే తన్నువచ్చి కలుసుకోమన్నానని చెప్పమన్నాడు. వెళ్తావా?" విక్రమ్ అడిగాడు.

"ఊ!" అన్నాను.

"అతనెక్కడుందీ నీకు తెలుసా?"

"తెలీదు!"

"అయితే నే చెప్పినట్లు చెయ్యి. తిన్నగా మద్రాసు వెళ్ళి, హోటల్ అలంకార్ లో రూం తీసుకో. నాలుగూ, నాలుగూ, జీరో, ఆరూ, మూడూ, ఆరూ, నెంబరుకు ఫోన్ చేసి నువ్వు వచ్చిన వైనం చెప్పు. ఆ తర్వాత మన క్రొత్త బాస్ అంటే దేవిడ్ నిన్ను కలుసుకుంటాడు" అన్నాడు వినోద్.

"ఓ. కే!" అన్నాను.

"ఖర్చులకు డబ్బేమైనా వుందా? లేక ఇచ్చేదా?"

"ఇవ్వు!" అన్నాను.

విక్రమ్ పర్సుతీసి ఐదు వంద రూపాయల నోట్లు అందించాడు. అవి అందుకుని జేబులోకి త్రోశాను.

"ఏ ట్రైన్ లో వెళ్తావు?" అడిగాడు.

"సాయంత్రం ఎక్స్ ప్రెస్ కు!" అన్నాను.

"బాస్‌కు మా శుభాకాంక్షలు అందించు. వ్యాపారం బాగుందని చెప్పు." అన్నారిద్దరూ.

"అలాగే!" అని శెలవు తీసుకొని, గదికిచేరాను.

3

గబ గబ బట్టలు సర్దుకున్నాను. మాయకు ఫోన్ చేశాను. ఆమె పలకలేదుగానీ, ఆపరేటర్‌లాంటి స్త్రీ ఒకామె, మెసేజ్ ఏమైనావుంటే చెప్పమంది. నేను మద్రాసు వెళ్తున్న వైనం చెప్పి, ఆ విషయం మాయకు తెలియ పరచమన్నాను.

ఆటో ఎక్కి సికింద్రాబాదు స్టేషనుకు చేరుకున్నాను. ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ కొనుక్కొని రైలెక్కాను.

నాకు 'కూపే'లో క్రింది బెర్తు దొరికింది. పైన ఎవరో మనిషి రైలు బయలుదేరకముందే, నిద్రపోవడం గమనించాను. అతను బహుశా హైద్రాబాద్‌లో ఎక్కి వుంటాడనుకున్నాను.

కిటికీ వారగా కూర్చొని, తాపీగా సిగరెట్ పీల్చసాగాను. నా సాయం కావాలనే డేవిడ్‌ను, చంపటానికి వెళ్తున్నానన్న నగ్నసత్యం నా కొక్కడికే తెలుసునను కున్నప్పుడు, నవ్వొచ్చింది.

మాయకు జరిగిన అన్యాయంకన్నా, మా బాస్‌కు జరిగిన అన్యాయం నన్ను నిలువునా కలచివేసింది. నేను ఏదైనా క్షమిస్తానుగానీ, నమ్మకద్రోహం మాత్రం క్షమించలేను. ఆ డేవిడ్ అంతుమాడటం మినహా నేను మరో పని ముట్టుకోదలచుకోలేదు.

మాయకు నేను పంపిన మెసేజ్ చేరివుంటే ఆమెకూడా బహుశా రైలెక్కి వుండాలనుకొన్నాను. కాజీపేట స్టేష

నులో చాలా సేపు ఆగుతుంది రైలు. అక్కడే వెతకాలను కున్నాను. డీసెల్ ఇంజను తగిలించిన రైలు, వాయువేగంలో పోతూంది. రైలు చక్రాలు పట్టాలకు రాచుకుంటుంటే, చెవులు గింగురుమనిపిస్తూ, శబ్దం వినరాసాగింది.

సిగరెట్ పారేసి బాత్ రూంకు బయలుదేరాను. కారిడార్ చివర అద్దంముందు నిలుచుని తలదువ్వుకొంటున్న మనిషి మొహం అమాంతంగా కనుపించింది నాకు. అతెన్నెక్కడో చూచినట్లుంది. మెల్లిగా వెళ్ళాను. దగ్గరకంటూ వెళ్ళక బాగాగమనించి చూసాను. అతని తలకట్టు, మీసాలు, బుగ్గపైన గాట్లు అన్నీ కృత్రిమంగా కనుపించాయి. సినిమాలో వేషం వేసేందుకు మేకప్ చేసుకొన్నట్లుంది తప్ప సహజంగా లేవు.

బాత్ రూంలోకి వెళ్ళాను.

నా మెదడునిండా అంతకుముందు చూచిన వ్యక్తి రూపమే నిండిపోయింది. అతను అతికించుకున్న మేకప్ తీసివేస్తే ఎలా వుంటాడన్నది ఊహించసాగాను. సరయిన రూపం ఏదీ నా మెదడులో పట్టుమని పదిసెకన్లపాటు నిలువలేదు.

వెలుపలికొచ్చాను.

అతనికోసం ఆత్రతగా చూశాను. కనుపించలేదు. నా కూపేకి వెళ్ళిపోయాను. పైబెర్తు పైనున్న వ్యక్తి నిద్రపోతూనేవున్నాడు. దుప్పటి అంతకుముందులాగే మొహం కనుపించకుండా కప్పుకొని వుండిపోయాడు.

సీట్లో కూర్చున్నాను. వద్దనుకున్నా ఆలోచనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూనే వున్నాయి.

ఏదిఏమైనా, నా జాగ్రత్తలో నేనుండడం అవసరం అనిపించింది. బెర్తుక్రిందకు తోసిన సూట్ కేసు వెలుపలకు

లాగాను. రివాల్వరు తీసి జేబులో వేసుకొన్నాను. నాలుగు స్మోక్ బాంబులు కూడా తీసి వుంచుకున్నాను.

మరో అరగంటకు రైలు కాజీపేట స్టేషను చేరుకుంది. దిగివెళ్ళి భోజనం చేసివచ్చాను. పై బెర్తు పైనున్న వ్యక్తి భోజనానికి కూడా దిగకుండా అలాగే నిద్రపోవడం గమనించాను.

కోచ్ అటెండెంటు అటువేపుగా వెళ్తూ కనిపించాడు. అతన్ని పిలచి పైనున్న వ్యక్తి విషయం చెప్పాను. అతని పేరు ప్రకాష్ అనీ, ఆరోగ్యం సరిగాలేక విశ్రాంతి తీసుకుంటున్నట్లు చెప్పాడని, తన్ని డిస్టర్బ్ చెయ్యవద్దన్నారనీ చెప్పాడు. ఆ మాట విన్నాక అంతకుముందుదాకా నా కతని పైనవున్న అనుమానం మబ్బులా విడిపోయింది.

రైలు బయులుదేరింది.
ఎవరో తలుపు తట్టినట్టయింది.
లేచివెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా అంతకుముందు బాత్ రూంవద్ద కనుపించిన మనిషి నిలుచుని వున్నాడు.

ద్వారానికి అడ్డంగా నిలుచుని "ఏం కావాలి?" అడిగాను.

"మా ఫ్రెండ్ కు ఒళ్ళు ఎలాగుందో చూడాలి! అతను పై బెర్తు పైన పడుకుని వున్నాడు." అన్నాడతను.
అడ్డు తొలగాను, అతను లోనికి వచ్చాడు. నేను కూర్చున్నాను. మళ్ళీ సిగరెట్ వెలిగించాను.

దబుక్కున పైనున్న వ్యక్తి క్రిందకుదూకాడు. అంతకు ముందు లోనికొచ్చినవ్యక్తి తలుపు పైకిదూకి దాన్నిలాగి, మూసి, వెలుపలనుంచి తీసేందుకు వీలులేకుండా హుక్ వేశాడు.

నాకు మెదడు పనిచెయ్యడం మానేసింది. సిగరెట్ విసిరేసి జేబులోంచి రివాల్వర్ తీశాను. దాన్ని పొజిషన్‌లో పెట్టుకునే వ్యవధికూడా లేకుండా ఒకతను నాపైకురికి గొంతు గట్టిగాపట్టుకొని, అతని తలతో నా తలను అదిమి పెట్టాడు వెనకసీట్‌కు. నాకు ఊపిరాడలేదు.

రెండో వ్యక్తి, నా రెండుకాళ్ళు పట్టుకుని ఒకదానితో ఒకటి మెలిపెట్టి ఘట్టిగా త్రిప్పసాగాడు. నా చేతులు అశక్తమయ్యాయి. నా తలపైని తలపెట్టి, కారెజ్‌కి అణచి పెట్టినవ్యక్తి, తలతో నుదురు చిట్లిపోయేట్లుగా రెండు మూడుసార్లు మొత్తాడు.

నాకు స్పృహపోయింది.

4

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి, నా చుట్టూ పచ్చరంగు వేసిన గోడలు, పైన ఫాను చుట్టూ ఫర్నీచరు కనిపించాయి.

అది హోటల్ గదయి వుండాలనుకున్నాను.

మెల్లిగాలేచి కూర్చున్నాను మంచంమధ్య.

గదిలో ఎవ్వరూలేరు, నేను తప్ప.

తలుపు నెట్టుకొని ఒకవ్యక్తి లోనికొచ్చాడు. అతన్ని అంతకుముందు నే నెక్కడా చూచిన గుర్తురాలేదు.

"ఎలా వున్నావ్?" అడిగాడు అతను.

"బాగానే వున్నాను. నువ్వెవరు? నన్నెందుకు ఇక్కడకు తీసుకొచ్చారు?" అడిగాను కాస్త కోపంగా.

"డేవిడ్‌ను చంపాలని బయలుదేరావ్? అవునా?"

"అలాగని ఎవరు చెప్పారు నీకు?"

"నా ప్రశ్నకది జవాబుకాదు! సరిగ్గా సమాధానం చెప్పు. లేకుంటే..." అంటూ పళ్ళు పటపటా కొరికాడు.

"ఏం చేస్తావ్?" అడిగాను కోపంగా.

"చంపుతాను." అన్నాడు అతను.

"నన్ను చంపమని డేవిడ్ చెప్పాడా నీకు." అడిగాను.

"అలా చెప్పివుంటే నిన్ను నలభైఎనిమిది గంటలముందే చంపి, పాతిపెట్టి వుండేవాళ్ళం. ప్రాణాలతో పట్టి తీసుకు రమ్మన్నాడు. అందుకే ఇక్కడ తెచ్చిపెట్టి కాపలా కాస్తున్నాము" అన్నాడతను.

"అలాగా?"

"అవును."

"అయితే నన్ను చంపేందుకు మీకు స్వాతంత్ర్యం లేదన్నమాట. నన్ను డేవిడ్ వద్దకు తీసుకువెళ్ళండి. మీ విషయం తేల్చుకుంటాను." అన్నాను.

"క్రింద కారు సిద్ధంగావుంచాం. నువ్వు ఏ విధమైన అల్లరిచెయ్యకుండా, బుద్ధిగా మాతోరావాలి!" అన్నాడతను మళ్ళీ బెదిరిస్తున్నట్లు.

"అలాగే వెళ్దాం! కానీ నాకు నడిచేఓపిక లేదు. ఎత్తుకుని తీసుకుపోతారా?"

"అలా వీలుకాదు! నడవాలి!" అధికారికంగా అన్నాడు

"నడవలేను!" మొండికేస్తూ చెప్పాను.

ఫోన్ మ్రోగింది.

అతనే వెళ్ళి అందుకున్నాడు. ఒకక్షణం అవతలి వ్యక్తి చెప్తున్న మాటలువిని "నీకే వచ్చింది. మాట్లాడు!" అంటూ రిసీవరు తెచ్చి అందించాడు.

"హల్లో!" అన్నాను అందుకుని.

"బాగున్నావా?" అడిగాడు అవతలవేపు వ్యక్తి. ఆ గొంతులోని జీర నాకు బాగాగుర్తు. అది డేవిడ్ ది.

"నన్ను మీవాళ్ళు బాగుండనివ్వడంలేదు!" అన్నాను.

"జరిగిందంతా నాకు తెలుసు. విధిలేని పరిస్థితుల్లో నా మనుషులు నీ పట్ల కాస్త కఠినంగా ప్రవర్తించినట్లు తెలిసింది. మరచిపో! మనిద్దరం మునుపటిలా స్నేహంగా వుండాలని నా కోరిక. అందుకే నిన్ను రప్పించుకుంటున్నాను." అన్నాడు డేవిడ్.

"నేను స్నేహంగా లేనని ఎలా తెలిసింది. నీ వాళ్ళు విక్రమ్, వినోద్‌ల సలహాపైనే బయలుదేరాను" అన్నాను నా మనసులోని భావాల్ని కప్పిపుచ్చుకుంటూ.

నిన్ను బాస్ పిలిపించి మాట్లాడడం, అతనికి నువ్వు నన్ను ఎలాగైనా చంపుతానని మాటివ్వడం, మొత్తం నాకు తెలుసు. బుకాయించి లాభంలేదు! మన మిద్దరం కలసి చాలారోజులు పనిచేశాం. ఆ పరిచయం, స్నేహం నన్ను నీ పట్ల క్రూరంగా ప్రవర్తించనీయటంలేదు. నువ్వు ఎప్పటిలా నాకు నమ్మినబంటుగా పని చెయ్యాలి" అన్నాడు డేవిడ్.

"ఆలోచిస్తాను!"

"అందుకే హోటల్‌కది అనవసరం. పైగా డబ్బు ఖర్చు కూడాను. అల్లరి చేయకుండా నేను ఏర్పాటు చేసిన కారెక్కి రా!" అంటూ నా జవాబు వినకుండా ఫోన్ కట్ చేశాడు డేవిడ్.

నేను రిసీవరు క్రేడిల్ పైన పడేశాను.

"వెళ్దామా?" అడిగాడు ఆగంతకుడు.

"ఆఁ!" అన్నాను.

"అయితే కదులు!" పురమాయించాడు నన్ను.

మంచంపై నుండి క్రిందకి దిగాను. నిలవడం కష్టమైంది. తూలిపడ్డాను. ప్రక్కనున్న వ్యక్తి నా భుజం

పట్టుకుని పైకి లేపాడు. కాళ్ళు నిలద్రొక్కుకుని నిలుచున్నాను.

అతని వెంట మెల్లిగా నడక మొదలెట్టాను. గదిలోంచి ఖరండాగుండా ఎలివేటర్ వద్దకు నడిచాం. మేమున్నది ఏడవ అంతస్తు. అక్కణ్ణుంచి క్రిందికొచ్చాం. పెద్ద కారొకటి సిద్ధంగావుంది. అందులో స్టీరింగు వీలువద్ద ఒక తను కూర్చుని వున్నాడు. అతని వేషాన్ని బట్టి సిక్కులా గున్నట్లు తోచింది. మేమిద్దరం వెనుక సీట్లో కూర్చున్నాం. నా వెంటనున్న వ్యక్తి తలుపులు మూశాడు.

"పోనీ!" అన్నాడు.

కారు పోవడం మొదలెట్టింది. ఊరు దాటింది. చీకటిని చీల్చుకుంటూ వెలుగుతున్నాయి హెడ్ లైట్లు.

నా మెదడులో రకరకాల ఆలోచనలు బయలుదేరాయి. నన్ను దేవిడ్ నమ్ముతాడన్న ధీమా పోయింది. అక్కడికి చేరాక చంపుతాడనిపించసాగింది. కానీ అతనికి నావల్ల కలిగే లాభాలున్నాయి. వాట్ని దృష్టిలో పెట్టుకొని ఎలాగైనా నన్ను తన వేపు త్రిప్పుకునే ప్రయత్నం చేసినా ఆశ్చర్యం లేదనుకున్నాను.

కారు సడన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయింది.

"ఏమైంది?" అడిగాడు నా ప్రక్కనున్న మనిషి డ్రైవర్ని.

"ఇంజన్ బాగా వేడెక్కింది?" అన్నాడతను.

"ఈ మాత్రానికేనా?" అడిగాను.

"ఈకాలం అంతా మాయేగదా? కార్ల తయార్ అంత చక్కగా వుంది." అన్నాడు అతను. మాయ అన్న మాటపైన అతను ఒత్తి పలికిన తీరు చూచి నాకు అనుమానం వేసింది.

"కబుర్లాపి దిగి, కాసిని నీళ్ళు ఆ రేడియేటరు మొహాన కొట్టు!" అన్నాడు అతను డ్రైవరుతో.

"మిస్టర్ మాటలు జాగ్రత్తగా రానీ! లేకుంటే నీపు సాఫవుతుంది!" అన్నాడు డ్రైవరు.

"ఎవరితో మాట్లాడుతున్నావు తెలుసా! డ్రైవరు కంత పెక్కుండ కూడదు. జాగ్రత్తగా మసలుకోకపోతే ప్రాణాలు తోడేస్తాను!" బెదిరించాడు ఆగంతకుడు.

ఆమాటనగానే డ్రైవరు ముందు సీట్లోంచి వెనుక వైపుకు దూకేడు అతనిపైకి. అతడు ఆగంతకుణ్ణి దేంతో కొట్టాడో తెలీదు గానీ, "అమ్మా!" అన్న అరుపు వినిపించింది. అతని తల క్రిందకు వాలి జారిపోయింది.

"చచ్చినట్లున్నాడు!" అన్నాను డ్రైవరుతో.

"పీడ విరగడయింది. త్వరగా దిగు వెళ్దాం!" అన్నాడు డ్రైవరు.

"నువ్వెవరు?" అడిగాను అనుమానం తీరక.

"నేనే మాయను!" అంది తలపైనున్న టర్బన్ విప్పి పారేస్తూ.

ఇద్దరం క్రిందికి దుమికాం. పరుగెత్తుకుంటూ చీకట్లో కలిసిపోయాం.

"ఇంత సాహసమా?" అడిగాను.

"నేను నా పగ సాధించుకునేందుకు నిన్ను నమ్ముకున్నాను. నువ్వే వాళ్ళ చేతుల్లో చిక్కుకుంటూ వుంటే చూస్తూ ఎలా వుండేది. అందుకే సాహసించాను" అంది మాయ.

"మార్వెలెస్! వాళ్ళ డ్రైవరు ఏమయినాడో?" అడిగాను.

"వాడికి శాస్త్రనా వొంపు సొంపులు చూపించి, కవ్వించాను. ఆపైన డబ్బిచ్చి చిత్తుగా తాగి అరువందలా మూడో నంబరు గదికి రమ్మన్నాను. వెళ్ళాడు పిచ్చి సన్నాసి. నేను వేషం మార్చుకుని కూర్చున్నాను" అంది మాయ.

"ఎలాగైతేనేం నన్ను రక్షించావ్? నీకు చాలా ఋణ పడివున్నాను. ఎలా తీర్చుకుంటానో...?" అన్నాను కృతజ్ఞతాపూర్వకంగా.

"ముందే చెప్పాను? ఆ డేవిడ్‌ను చంపితే చాలు నా ఋణం, నా భర్త ఋణం తీర్చినట్లవుతుంది!" అంది మాయ.

"ఇకపైన మనమేం చెయ్యాలి!" అడిగాను.

"ఆ డేవిడ్ ఎక్కడుందేదీ తెలుసుకున్నాం మనం. నీ గురించి అతను తెలుసుకున్నాడు. అనవసరమైన సాహ సాలు చేసి నువ్వు సాధించబోయేది ఏదీ వుండదని నా నమ్మకం. అతన్ని మనం ఉపాయంతోనే మట్టుబెట్టాలి!" అంది మాయ.

"ఆ ఉపాయమేదో నువ్వే చెప్పు!" అన్నాను.

"అతనీ వూళ్ళో రెండు వ్యక్తిత్వాలతో, ఇద్దరు వ్యక్తులుగా చలామణీ అవుతున్నట్లుగా తెలిసింది. డేవిడ్ పేరుతో డెవిల్‌లా దొంగతనాలు, హత్యలు, దోపిడీలు చేయిస్తున్నాడు. థియొడర్ పేరుతో పెద్ద మనిషిలా రకరకాల దానాలు చేస్తూ, పేరు సంపాయించుకుంటు న్నాడు. మొదటి వ్యక్తిత్వంతో తలపడి లాభంలేదు. రెండో మనిషిని మనం బోల్తా కొట్టించాలి. ఏమంటావ్?" అనడిగింది మాయ.

"నాకన్నా ఎక్కువ సమాచారం నీ దగ్గరే వుంది. నువ్వు చెయ్యమన్నట్లు చేస్తాను" అన్నాను.

అలంకార్ హోటల్‌కు వెళ్ళి రూం తీసుకున్నాము. స్నానపానాదులు ముగించి చెరో మంచంపైన వాలి పోయాం.

5

నేను నిద్రలేచి 'టయిమ్ చూసుకున్నాను. ఐదయింది. ప్రక్క మంచంకేసి చూశాను. మాయ లేదు. అప్పుడే మాయమయిపోయిందా, అనుకున్నాను.

బెల్ నొక్కాను భాయ్ వచ్చాడు. కాఫీ ఆర్డరు చేశాను. వాడు వెళ్ళాక బాత్‌రూంకు వెళ్ళివచ్చాను. ఐదు నిమిషాల తర్వాత భాయ్ కాఫీ కప్పు తెచ్చి పెట్టాడు. అందుకుని త్రాగబోతుండగా మాయ లోనికి వచ్చింది.

"వచ్చావా? మాయమయిపోయావని అనుకున్నాను." అన్నాను నవ్వుతూ.

"అంత సులభంగా పోను!" అంది మాయ.

"ఇంతకూ ఏదయినా మార్గమాలోచించావా?" అడిగాను.

"ఆఁ!" అంది మాయ.

"ఏమిటది? చెప్పు!" ఆత్రుతగా అడిగాను.

"థియోడరుకు అతని బాస్‌ను మోసం చేసి విడిగా వచ్చేసింది మొదలు ప్రాణాలపైన ప్రేమ, తీపి ఎక్కువయింది. ఆ సమానం. జ్యోతిష్యం, హస్తశాస్త్రం, అంటూ కనుపడ్డ చిలక జోష్యుల వెంట కూడా తిరుగుతున్నట్లు విన్నాను," అంది మాయ.

"దాని వల్ల మనకేం ప్రయోజనం?" అడిగాడు.

"మనం కూడా జ్యోతిష్యం చెప్పే వాళ్ళల్లా తయారయి అతని కోటలో పాగ వెయ్యాలి."

"ఆ గొడవలు మనకు తెలీవే?" అన్నాను.

"డేవిడ్ గతం నీకు పూర్తిగా తెలుసు. నీకన్నా గొప్పగా అతనికి జ్యోతిష్యం చెప్పగల నేర్పు ఎవ్వరికీ వుండదు" అంది మాయ.

"భవిష్యత్తు చెప్పాలి?"

"అతనికెలా ఇష్టంగా వుంటుందో మనకు తెలుసు' అవే జరుగుతాయని చెప్పు. ఆనందంతో చంకలెగరేస్తాడు!" అంది మాయ.

"అతన్ని మనం ఎలా చంపాలి?"

"అదంతా కోటలోపాగా వేశాక ఆలోచిద్దాం!' అంది మాయ.

ఆ రాత్రికి మాయ చెప్పినట్లుగా సెలూన్ కి వెళ్ళి, తల పూర్తిగా తీసేసి శిరోముండనం చేయించుకున్నాను. కనుబొమలు తీయించుకుని కాషాయవస్త్రాలు కొని తెచ్చుకున్నాను.

తెల్లవారేలోపుగా హోటల్ మార్చేశాం.

పేపర్లనిండా ప్రఖ్యాత జ్యోతిశ్శాస్త్రవేత్త మార్కండేయులిగార్ని ప్రశాంత్ హోటల్ లో సంప్రదించి, గతం భవిష్యత్తు తెలుసుకోమంటూ మాయ తయారుచేసి యిచ్చిన అడ్వర్టయిజు మెంట్లు పడ్డాయి.

ఒంటిగంటపైన ఫోన్ కాల్స్ రావడం మొదలెట్టాయి. అందరికీ మాయే జవాబు చెప్పేది. ఆమె ఏం చెపుతున్నది కూడా నేను పట్టించుకోలేదు.

"ఇప్పటికి వంద కాల్స్ వచ్చాయి" అలసిపోతూ అంది నా కెదురుగా కుర్చీలో జేరపడి.

"ఏం చెప్పావ్?"

"ఈ దినం మౌనవ్రతంలో వున్నారనీ, రేపు రావల్సి వుంటుందనీ చెప్పాను" అంది మాయ.

"అలా ఎందుకు చెప్పావ్?"

"వాళ్ళ జాతకాలు మనకు తెలీవు, అయినా మనకు కావలసిన వ్యక్తి లేరు." అంది మాయ.

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

మాయ రిసీవరు అందుకుంది.

ఫోన్‌లో అవతలవేపు వ్యక్తి తనెవరయిందీ చెప్పి నట్లుంది. వినగానే మొహం ప్రసన్నం చేసికుని, నావేపు చూపి "థియోడర్" అంది.

నేను ఉత్సాహంగా దగ్గరకు జరిగాను.

"నేను! స్వామి నిత్యానంద సెక్రెటరీని. మధ్యాహ్నం రెండింటికి రండి" అంది మాయ.

ఆ తర్వాత ఫోన్ పెట్టేసింది.

"పిట్ట వల్లో పడింది!" అంది మాయ.

"ఏమంటాడు?"

"పేపర్లో అడ్వర్టయిజుమెంటు చూశాడట. మీతో కన్సల్టు చెయ్యాలట. అపాయింట్ మెంట్ అడిగాడు ఇచ్చాను. రెండింటికి వస్తాడు. వచ్చాక ఏం చెప్పవల సిందీ గుర్తుందిగా!" అడిగింది మాయ.

"ఆఁ!" అన్నాను.

"జాగ్రత్తగా వుండాలి! అతను నిన్ను అనుమానించే పరిస్థితి కలగకుండా చూచుకోవాలి!" అంది మాయ.

"మన వేషాలు చూశాక కన్నతల్లికూడా మనల్ని గుర్తుపట్టటం అసంభవం," అన్నాను.

6

రెండింటికి థియొడర్ వచ్చాడు. రాగానే నా కాళ్ళ పైన బడి మ్రొక్కాడు.

అతన్ని ఆశీర్వదించి పైకి లేవదీశాను. కూర్చోమని సంజ్ఞ చేశాను.

మాయకూడా మామధ్యనే వుంది.

"నువ్వో పెద్ద సమస్యలో చిక్కుకున్నావ్. నీ ప్రాణాలు ఉంటాయా పోతాయాని భయపడుతున్నావ్ అవునా?" అడిగాను.

"అవును స్వామీ! అదే నన్ను పట్టుకుని ప్రస్తుతం వేధిస్తున్న సమస్య," అన్నాడు థియొడర్.

"నువ్వు నమ్మకద్రోహం చేశావ్. అందుకే నీకు భయంగా వుంది" అన్నాను మళ్ళీ.

అతను మాట్లాడకుండా తలూపాడు.

"నువ్వుంటున్న ఇంట్లో దోషముంది. దాన్నో దయ్యం పట్టుకుని వ్రేలాడుతుంది. దానివల్లే నీ ప్రాణాలకు ముప్పు వస్తుంది. అది నీ ప్రత్యర్థుల ప్రయత్నాలకు తగిన సాయం చేయాలని చూస్తుంది. దాన్ని ఇంట్లోంచి తరిమి వెయ్యాలి" అన్నాను.

"అందుకేం చెయ్యాలి!" అడిగేడు థియొడర్.

"దేవీ పూజ చేసి, మంత్రజలం ఇల్లంతా జల్లితే ఆ దెయ్యం వెళ్ళిపోతుంది," అన్నాను.

"తమరిదయ ఆ పూజేదో మీరు చెయ్యాలి!" అన్నాడు థియొడర్.

"అందుకు చాలా ఖర్చవుతుంది. మా ప్రశాంతతకు భంగం రాకుండా నువ్వు చూడగలగాలి!"

"అవన్ని నాకు వదిలేయండి."

"అలాగే వదిలేస్తాం! అయితే రేపు రమ్మంటావా?"

"రేపటిదాకా ఎందుకు? ఇవాళే వెళ్దాం!" అన్నాడు థియొడర్.

నేను మాయకేసి చూశాను.

ఆమె సరేననమని సంజ్ఞ చేసింది కళ్ళతో.

ఆ తర్వాత రెండు నిముషాలకు నేనూ, మాయ, అతని కారెక్కాం లగేజిలతో. కారు జోరుగా పోసాగింది. సెంట్ థామస్ మౌంట్‌లో, ఎత్తుగా వున్న చిన్న కొండ కానుకొని ఉన్న బంగళాలోకి వెళ్ళి ఆగింది.

"ఇదే నా బంగళా!" అన్నాడు థియొడర్.

"నీది కాదు! ఇది కొని ఇంకా ఆరవైరోజులు పూర్తి గాలేదు. ఆ డబ్బంతా దొంగతనాలు, దోపిడీలు, హత్యలు తాలూకూది అవునా?" అడిగాను.

"స్వామీ!" అంటూ వినయంగా వంగి నమస్కరించాడు, ఇంక ఆ విషయాలు ముగించమని.

"మాకోసం ఒకగది ప్రత్యేకించారు. ఎయిర్ కండిషన్ చేసివుందా గది.

"మాయా!" పిలిచాను.

"ఏమిటి?" అడిగింది.

"మనల్ని అనుమానించాడా?"

"అలాంటిదేమి లేదు! ఇకపైన నువ్వు జాగ్రత్తగా వుండాలి." అంది మాయ.

"ఈరాత్రి డేవిడ్‌ను సఫా చేస్తాను" అన్నాను.

"తొందరపడకు. ఇక్కడ పరిస్థితులన్ని తెలుసుకొన్న తర్వాతగాని ఏమీ చెయ్యలేము" అంది.

ఆ రాత్రిదాకా ఇద్దరం గదిలోనే వున్నాం. సాయంత్రం వేళ థియొడర్ వచ్చి, పూజకు కావలసిన సామగ్రి వివరాలు తెలుసుకొని వెళ్ళాడు.

7

పదిదాటాక నేను గదిలోంచి వెలుపలికొచ్చాను.

ఇల్లంతా తిరగడం మొదలెట్టాను. థియొడర్‌కు భార్యాపిల్లలులేరు. ఆ విషయం నాకు ముందే తెలును.

అతనిగది మేడపైనవుంది. గదిముందు ఇద్దరు మనుషులు కాపలా వున్నారు. వాళ్ళ దగ్గర ఆయుధాలు కూడా వుండటం గమనించాను. అతను తగిన జాగ్రత్తలోనే వున్నాడనుకొన్నాను.

ఆ తర్వాత గదివెనుక వేపున్న బాల్కనీలోకి వెళ్ళాను. అటువేపున్న గది కిటికీలకు ఐరన్‌మెష్ వేసివుంది. పైగా తలుపులు కూడా కలిసివున్నాయి. షట్టర్స్‌కున్న గ్లాస్‌ను చేత్తో లాగాను. అది బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్. వెలుపలినుంచి రివాల్వరుతో కాల్చే వీలులేదు.

ఇంట్లో మొత్తం ఆరుమంది అనుచరులున్నారు అతనికి. వాళ్ళకు అతన్ని కాపాడడమే డ్యూటీ. మా బాస్‌కు భయపడి చాలా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకున్నాడు.

నేను తిరిగి వస్తూండగా విక్రమ్, వినోద్ అతని గదిలోకి వెళ్ళడం గమనించాను.

దూరంగా ఆగాను. లోపలవాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలన్న ఆత్రుత కలిగింది. గదిచుట్టూ తిరిగాను. ఎటూ శబ్దం వెలుపలికొచ్చే అవకాశంలేదు. నాప్రయత్నం ఫలించలేదు. ఐదునిముషాల తర్వాత వెలుపలికొచ్చారా ఇద్దరు.

"వాడ్ని మనం తెలివిగా పంపించాం. చిక్కినట్లే చిక్కి మాయమయినాడట. అందుకు మనల్ని తిడతాదేమిటి?" విసుగ్గా వినోద్ అడగటం వినిపించింది.

"మళ్ళీ పట్టుకొచ్చి అప్పగించకుంటే చంపుతానంటాడు. ఇదో బెడద!" అన్నాడు విక్రమ్.

"ఆ సుధీర్ గాడు అఖండుడు. డేవిడ్ దగ్గర బాగా తర్ఫీదు పొందిన మనిషి. వాణ్ని పట్టుకోవడం అంత యీజీ గాదనుకుంటాను." అన్నాడు వినోద్.

అలా మాట్లాడుకుంటూ మెట్లుదిగి క్రిందికి పోతున్న వాళ్ళవెంట నేనూ వెళ్ళాను. హాల్లోంచి వాళ్ళు వీధివైపు వెళ్ళారు. నేను నా గదికేసి వెళ్ళాను. మాయ గదిలో లేదు. ఏమైందా అని అనుకుంటూ ఆలోచిస్తూ కూర్చున్నాను.

తలుపు తట్టిన చప్పుడయింది.

"తీసేవుంది!" అన్నాను.

థియొడర్ లోనికొచ్చాడు.

నా ప్రక్కనే స్టూలుపైన కూర్చున్నాడు.

"మీ అసిస్టెంటు లేడా?" అడిగాడు థియోడర్.

"వెలుపలకు వెళ్ళినట్లుంది. మీ యిల్లంతా తిరిగాను దయ్యం పగలంతా ఆ కొండపైనుంటూంది. రాత్రి పది దాటాక గదిలోకి వస్తుంది." అన్నాను.

"మనుషులు రాకుండా కాపలా పెట్టుకున్నాను. దయ్యాల్ని రానీకుండా చేసేశక్తి వాళ్ళకు లేదు!" అన్నాడు థియోడర్.

"రేపట్నుంచి రాదు! నువ్వేం కంగారుపడకు." అన్నాను.

"అదికాదుస్వామీ! ఇంతకుముందు నేను, మరో వ్యక్తి కలిసి వ్యాపారం చేశాం. నన్ను మోసంచేశాడు. సరయిన వాటా ఇవ్వలేదు. నేనూ అతన్ని మోసంచేశాను. ఇప్పుడు నన్ను చంపడానికి అతను మనుషుల్ని నియమించాడు. ఈ ప్రయత్నంలో అతను నెగ్గుతాడంటారా?"

"నెగ్గడు. నిన్ను చంపేందుకతను ఒక మనిషిని నియమించాడు. అతని పేరు సుధీర్. అతనూ సామాన్యుడు కాడు. కానీ అతనికి నిన్ను చంపడం సాధ్యం కాదు!" అన్నాను.

"అతనుగాక వేరే ఎవరయినా ప్రయత్నాలు చేస్తున్నారా?" అడిగాడు థియోడర్.

"నీవు నమ్మకముంచిన వాళ్ళే నిన్ను మట్టుపెట్టే ప్రమాదముంది జాగ్రత్తగా వుండు. ఎవర్నీ నమ్మకు." అన్నాను.

"అలాగేస్వామీ!" అంటూ శెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

రాత్రి చాలాసేపు మాయకోసం ఎదురుచూస్తూ మేలుకొని కూర్చున్నాను. ఆమె రాలేదు. ఏమయిపోయిందో అర్థంగాక ఆలోచిస్తూండిపోయాను. అలాగే నిద్రపట్టేసింది.

8

తెల్లటి వెలుతురు కిటికీ అద్దంలోంచి గదిలోపడుతోంది. లేచి కూర్చున్నాను.

మాయ తల ఆరబోసుకునివుంది.

"రాత్రి ఎక్కడికెళ్ళావ్?" అడిగాను.

"కొంత సామగ్రి తెచ్చేందుకు వెళ్ళాను" అంది మాయ

"మరి నాతో చెప్పిపోలేదేం?"

"ఎవ్వరితోనూ చెప్పలేదు. ఎవ్వరూ చూడకుండా వెళ్ళాను. వచ్చాను." అంది మాయ.

"ఏం సామగ్రి తెచ్చావ్?" అడిగాను.

చిన్న సంచీ అందించింది. దాన్ని తెరచిచూశాను. దాన్లో కమండలం లాంటి దొకటివుంది. పై భాగం త్రిశూలంలా కోలగావుంది. వెనుకవేపు త్రిప్పితే రివాల్వరులాగుంది. దాని ట్రిగ్గర్ పై భాగంలోవుంది. అందులో రివాల్వరు అమర్చివుందని గమనించడం అతికష్టం.

"చాలా బాగుందిలే!" అన్నాను.

"ఇప్పుడు తయారుచేయించి తెచ్చాను" అంది మాయ.

"నువ్వు అసాధ్యురాలివి" అన్నాను.

"పూజగదిలో అంతా కర్మకాండ జరిగాక, డేవిడ్‌ను ఒంటరిగావుండే ఏర్పాటు చేస్తాను. అతన్నిచంపేసి కిటికీ తలుపు తోసుకుని బాల్కనీలోకిరా. అక్కడే బట్టలు మార్చుకుని, మనం క్రిందికి వెళ్ళిపోవాలి. మనకోసం కారు సిద్ధంగావుంటుంది. అన్నీ ఏర్పాటుచేశాను. అందుకే వెలుపలికి వెళ్ళివచ్చాను."

"నీ ప్లాను చాలాబాగుంది. నీలాంటి అండవుంటే, ఎంతమందినైనా సులభంగా హత్యచేస్తాను. డేవిడ్ మాత్రం కాదు వాడిబాబైనా నాకు లెఖ్ఖలేదు!" అన్నాను.

"అలా మాట్లాడకు ఎవరయినా వినగలరు" అంది మాయ.

"ఇంకెంతసేపు. మన పని పూర్తి కాబోతుంది" అన్నాను.

"అప్పుడే కాదు! హత్య జరిగాక మనం ఎవ్వరికీ చిక్కకుండా, వెళ్ళడం అవసరం. అదయ్యాక నాకింకో

కోరిక వుంది. నిన్ను డేవిడ్‌ను చంపేందుకు పురికొల్పిన మీ బాస్‌ను కూడా నీచేతే చంపించాలి!" అంది మాయ.

ఆమె మాటలు విని నా మతి పోయినట్లయింది. నా గురించి ఆమె వేసిన పథకాలు చూచి నివ్వెరపోయాను.

"నాపైన నీకెందుకు అంత అభిమానం!" అడిగాను.

"అభిమానం కాదు! ఆ ఇద్దరిపైన వున్న కోపమను కాగుంటుంది" అంది మాయ.

9

నేను పూజా పునస్కారాలు పూర్తి చేసుకుని కాషాయ వస్త్రాలు కట్టుకుని కూర్చున్నాను.

థియొడర్ వచ్చి నా దర్శనం చేసుకుని వెళ్ళిపోయాడు. మాయ పూజకు మరి కొన్ని సామగ్రీ కావలసి వుందని చెప్పి కారులో వెళ్ళిపోయింది.

నేను ఒంటరిగా వుండిపోయాను.

గదిలో వున్న ఫోన్ మ్రోగింది. వెళ్ళి రిసీవరు తీసుకున్నాను. "హల్లో!" అన్నాను.

"ఎవరు మాట్లాడేది?" అడిగాడు అవతల వేపునుండి.

ఆ కంఠం గుర్తించాను. అది మా బాస్‌ది. అతనికి నేను ఇక్కడున్నట్లు ఎలా తెలిసింది? ముందు ఆశ్చర్య పోయాను.

"నేను స్వామి నిత్యానందను" అన్నాను.

"నోర్ముయ్! నువ్వెవరో నాకు తెలుసు. నువ్వు సుధీర్‌వి. థియొడర్ పేరుతో తిరిగే ఆ దగుల్బాజీ డేవిడ్ గాడ్ని చంపి ఆ తర్వాత నన్ను చంపేందుకు అక్కడ కూచుని కుట్ర చేస్తున్నావు కదూ! నిన్ను ఏం చేస్తానో చూడు!" అంటూ ఫోన్‌లోనే రంకెలు వెయ్యడం మొదలెట్టాడు.

"ఎవరా మాట చెప్పింది! అలా చెయ్యాలంటే ముందు నిన్నే హతమార్చేవాడిని" అన్నాను.

"వాగకు! నీ సంగతులూ నాకు తెలిసింది. మా ఇద్దర్నీ చంపి, నువ్వు పెద్ద వాడివి కావాలని కదూ నీ ప్లాను. నా అండలో డేవిడ్‌ను చంపేశాక, అతని బలం, బలగం వెనక పెట్టుకొని నన్ను చంపాలని కోరుకున్నావ్. ఆ విషయం నాకు తెలిసినందుకు భయపడి చస్తున్నావ్!"

"భయమా! అదెటువంటిదో నాకు తెలీదు!" అన్నాను.

"పోనీ! ఇప్పుడు తెలుసుకో! నీరంగు బయట పెట్టానంటే డేవిడ్ నిన్ను నల్లిని నలిపినట్లు నలిపి పారేస్తాడు. నీవన్నీ గాలి మేడలయి కూల్తాయి. ఏమంటావ్?" అడిగాడు బాస్.

నాకేం చెప్పాలో తెలీలేదు. నా మనస్సులో లేని అభిప్రాయాలను, ఉన్నాయనుకొని ఊహించి, అతనికి సాయం చేద్దామని వచ్చిన నన్ను, సింహానికి ఆహారంలా వేస్తానంటే అదే సింహం గుహలోనే, ఏం చెప్పేది.

"నీకిచ్చిన మాట నిలుపుకొనే ప్రయత్నంలో ఉన్నాను. చెప్పుడు మాటలు వినిన, నువ్వు చెడి, నన్ను చెడగొట్టకు!" అన్నాను శాంతకఠినంగా.

"తెల్లవారేలోగా అతన్ని చంపాలి! లేకుంటే నేను చెప్పినట్లు చేస్తాను?" అన్నాడు బాస్.

"అలాగే!" అన్నాను.

ఫోన్ కట్ అయింది.

10

గంట తర్వాత మాయ వచ్చింది.

జరిగింది చెప్పాను.

"అయితే రాత్రికే ఇద్దర్నీ సఫా చేసేస్తే పోతుంది" అంది మాయ.

"ఎలా?" అడిగాను.

"మీ బాస్ ఎక్కడ దిగాడో అడిగావా?"

"లేదు!" అన్నాను.

"ఆమాత్రంకూడా తెలుసుకోలేనివాడివి ఇన్నిదినాలు ఎలా ఈ వ్యాపారంలో పనిచేశావ్?" అడిగింది నవ్వుతూ

"నీతో చేరాక నా తెలివితేటలపైన నమ్మకంపోయింది. నువ్వు చెప్పినట్లు చెయ్యడం బాగుందనిపిస్తూంటుంది" అన్నాను.

అంతలో డేవిడ్ లోనికొచ్చాడు. అతని కళ్ళు ఎర్రగా చింతనిప్పల్లా వున్నాయి. మనిషి క్రిందనుండి పైకి వణకడం మొదలెట్టాడు.

తిన్నగా నా కెదురుగా వచ్చి నిలుచుని నా కళ్ళలోకి సూటిగా చూశాడు.

"నువ్వు నిజంగా నిత్యానంద వేనా?" అడిగాడు.

మాయ కాస్త వెనక్కి జరిగింది.

"అవును" అన్నాను.

"కాదు! నువ్వు సుధీర్ వు. నన్ను మోసంతో చంపాలని వచ్చావు. సరయిన టయిమ్ కు నీ నిజరూపం తెలుసుకోనే అవకాశం కలిగింది. నిన్ను ఇప్పుడే నరికిపారేస్తాను!" అంటూ జేబులోంచి రివాల్వరు తీశాడు డేవిడ్.

"ఎవరు చెప్పారా మాట!" ధైర్యం కూడగట్టుకొంటూ అడిగాను.

"ఇంతకుముందు నీ టెలిఫోన్ సంభాషణ అంతా విన్నాను" అన్నాడు డేవిడ్ రివాల్వరు పైకెత్తి.

నేనూ కమండలం పైకెత్తాను.

"పిచ్చివాడా, మంత్రాలకు చింతకాయలు రాలవు!" అన్నాడు డేవిడ్.

"మంత్రం కాదు! మాయ నీకోసం తెచ్చిన మాయా మంత్రదండం ఇది. ఇందులో రివాల్వరుంది!" అన్నాను గురిపెట్టి కాల్చుతూ. రివాల్వర్ పేలింది. కానీ, డేవిడ్ చావలేదు. వికటంగా నవ్వాడు.

అంతలో, తలుపులు దబ్బున తెరచుకొన్నాయి.

వెనుకనుండి పోలీసులు వచ్చి డేవిడ్‌ను పట్టుకొన్నారు.

మాయ నవ్వింది.

ఐ. జి. ఆఫ్ పోలీస్ వచ్చి మాయతో కరచాలనం చేసి, "ఈ ముగ్గుర్ని ఒక్క దెబ్బకు పట్టిచ్చావు. నీ తెలివి తేటలు, సాహసం అద్భుతం!" ప్రశంసించాడు.

నేను నవ్వలేక ఏడ్చాను.

"నేను చేసిందేమీ లేదు. ఒకరికొకరు ద్రోహం చేసుకున్నారు వాళ్ళు. ఒకరిపైకి మరొకర్ని దువ్వాను. ఫలితం ముగ్గురూ చిక్కారు" అంది మాయ.

మాయ నన్ను కాదు, నా సామర్థ్యాన్ని, శక్తిని మాయ చేసింది.

అందుకే చివరకు మేము ముగ్గురం జైలుకమ్మిలు లెక్క పెడుతూ కలిసి కూర్చున్నాం.

-: ఐ పో యిం ది :-